సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలి

ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ నేత రత్నాకర్‌రావు డిమాండ్ చేశారు. - 8లో



నేడు రేడియో కేంద్రాలు ప్రారంభం

నల్లగొండ, దేవరకొండలో శుక్రవారం రేడియో కేంద్రాలు ప్రారంభించనున్నట్లు ప్రసార భారతి డీడీ తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
37° / 24°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తపాలా సేవలు వినియోగించుకోవాలి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మిర్యాలగూడ: తపాలా సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ ఉమ్మడి జిల్లా సూపరింటెండెంట్ వడ్ల మూడి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ మహమ్మద్ నయీమొద్దీన్ అన్నారు. గురువారం దామరచర్ల మండలం కల్లేపల్లి గ్రామంలో నూతన తపాలా శాఖ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలు లేని మారుమూల ప్రాంతాల్లో సైతం పల్లె ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందచేయడానికి నూతన తపాలా శాఖను ఇక్కడ ప్రారంభించినట్లు తెలిపా రు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లలిత హాతిరాంనాయక్, సర్పంచ్ మాలోతు జనార్దన్, ఎంపీటీసీ శారదపాచునాయక్, తపాలా శాఖ సిబ్బంది మోతీలాల్, తూక్యానాయక్, సత్యనారాయణ, నరసింహారెడ్డి, ఎర్రనాయక్, అశోక్, బాలు, శ్రీను, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని తూర్పార పట్టాలి



రికార్డు పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ కాళిందిని

గుర్రంపోడు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్యాడీ క్లీనర్ మిషన్లలో రైతులు తప్పనిసరిగా ధాన్యాన్ని తూర్పార పట్టుకోవాలని డీఆర్‌డీఓ కాళిందిని అన్నారు. గురువారం మండలంలోని కోయగూరోనిబావిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కేంద్రాలను తీసుకొచ్చే ధాన్యం ప్రమాణాల మేరకు నాణ్యతగా ఉంటేనే గరిష్ట మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులకు మూడు రోజుల్లోనే ధాన్యం డబ్బులు అందుతున్నాయన్నారు. మండలంలో ఆరు ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా లక్షా 30 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు ఏపీఎం మైసేశ్వర్‌రావు వివరించారు. లారీల కొరత లేదని, ఇప్పటికే 16 ట్రక్కులు పంపించామని తెలిపారు. పీడీ వెంట ఎంపీడీఓ సుధాకర్ ఉన్నారు.

కేంద్ర బృందం సందర్శన



వైద్యులతో సమావేశమైన బృందం సభ్యులు

మిర్యాలగూడ అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్ష్యా పథకం అమలు కమిటీ సభ్యులు డాక్టర్ భద్రకంత శర్మ, డాక్టర్ ఆర్.జయంతి గురువారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న పరికరాలను పరిశీలించారు. అనంతరం వైద్యులతో సమావేశమయ్యారు. ఈ ఆస్పత్రి లక్ష్యా పథకం కింద ఎంపికైతే దీని అభివృద్ధికి కేంద్రం ఏటా రు.3లక్షల నిధులు విడుదల చేయనుందని తెలిపారు.

లీజు భారం రైతులపై మోపొద్దు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

మునుగోడు: ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటుకు తీసుకున్న భూమి లీజు భారం రైతులపై మోపొద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మునుగోడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని త్వరగా కాంటాలు వేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతులను మోసం చేయకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం తూకం వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం, మునుగోడు సర్పంచ్ మిర్యాల వెంకన్న, పార్టీ మండల కార్యదర్శి మిర్యాల భరత్ కుమార్, వరికుప్పల ముత్యాలు, యసరాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగ' సభకు సిద్ధం

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి

- సాయంత్రం 4 గంటలకు ఎంజీయూకి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాక
- యూనివర్సిటీ విద్యార్థులతో భేటీ
- మర్రిగూడ బైపాస్ నుంచి పాదయాత్ర
- క్లాక్ టవర్ సెంటర్‌లో బహిరంగ సభ
- హాజరుకానున్న ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రులు జానారెడ్డి, ఆర్డీఆర్



ఎంజీ యూనివర్సిటీ వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి తదితరులు

సాక్షిప్రతినిధి, నల్లగొండ: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంపై శుక్రవారం నల్లగొండలో నిర్వహించతలపెట్టిన నిరుద్యోగ నిరసన సభకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో మధ్యాహ్నం 2:30 గంటలకు చౌటుప్పల్‌లో స్వాగత కార్యక్రమంతో మొదలుకొని రాత్రి 7 గంటలకు నల్లగొండలో జరిగే బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు చేసింది. త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న నిరుద్యోగ నిరసన సభకు కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీ హాజరుకానున్న నేపథ్యంలో ఆ సభను విజయవంతం చేసేందుకు సన్నాహకంగా టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండలో నిరుద్యోగ నిరసన సభ నిర్వహిస్తున్నారు. ఈ సభకు నల్లగొండ ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి హాజరుకానున్నారు. పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు.

భారీగా జన సమీకరణకు ఏర్పాట్లు

రేవంత్‌రెడ్డి పాల్గొనే కార్యక్రమాలకు పార్టీ శ్రేణులను పెద్ద ఎత్తున తరలించే బాధ్యతను మండల నేతలకు అప్పగించారు. యూనివర్సిటీ వద్దకు చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, గట్టుప్పల మండలాల పార్టీ కార్యకర్తలు చౌటుప్పల్ మీదుగా చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. మునుగోడు, చిట్యాల మండలాలు, భువనగిరి, ఆలేరు నుంచి వచ్చే శ్రేణులు కూడా అక్కడికే వచ్చేలా ఏర్పాట్లు చేశారు. రామన్నపేట, నార్కట్‌పల్లి, కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి మండలాల నుంచి వచ్చే వారు నార్కట్‌పల్లికి వచ్చి అక్కడి నుంచి రేవంత్‌రెడ్డి ర్యాలీలో పాల్గొంటారు. నల్లగొండలోని మర్రిగూడ బైపాస్ వద్ద ప్రారంభమయ్యే పాదయాత్ర వద్దకు చండూరు, నాంపల్లి , చందంపేట, మర్రిగూడ మండలాలకు చెందిన వారు చేరుకుంటారు. తుంగతుర్తి, దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల నుంచి వచ్చే నేతలు, కార్యకర్తలంతా మర్రిగూడ బైపాస్‌కే వచ్చి రేవంత్ పాదయాత్రలో పాల్గొంటారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన నేతలు

రేవంత్‌రెడ్డి పాల్గొనే కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు గురువారం పర్యవేక్షించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, చెరుకు సుధాకర్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి తదితరులు మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులతో సమావేశం అయ్యారు. పోటీ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు పడిన ఇబ్బందులను రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేశారు. అలాగే నార్కట్‌పల్లి నుంచి పార్టీ శ్రేణులను తరలించే సమావేశంలో కొండేటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన అనుచరులు వివిధ మండలాలు నుంచి పార్టీ శ్రేణులను తరలించే సన్నాహక సమావేశాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా నల్లగొండ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలిరావాలని నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చింది.

ఇదీ.. రేవంత్ పర్యటన షెడ్యూల్

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 2:30 గంటలకు చౌటుప్పల్‌కు చేరుకోనున్నారు. అక్కడ నేతలు, పార్టీ కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలుకుతారు. అనంతరం నిర్వహించే సభలో రేవంత్ మాట్లాడనున్నారు. 3 గంటలకు చిట్యాల వద్ద చిట్యాల పట్టణంతో పాటు భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలకు చెందిన నేతలు, కార్యకర్తలు స్వాగతం పలకనున్నారు. 3.30 నార్కట్‌పల్లికి చేరుకుంటారు. అక్కడ నార్కట్‌పల్లి, కేతేపల్లి, కట్టంగూర్, నకిరేకల్ మండలాలకు చెందిన 2 వేల మంది భారీ బైక్ ర్యాలీతో స్వాగతం పలకనున్నారు. వారిని ఉద్దేశించి మాట్లాడిన అనంతరం 4 గంటలకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ గేట్ వద్దకు రేవంత్‌రెడ్డి చేరుకుంటారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారితో పాటు అమరవీరులకు నివాళులర్పించనున్నారు.ఆ తర్వాత విద్యార్థులతో భేటీ కానున్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతూ ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, బాధితులతో మాట్లాడనున్నారు. అక్కడి నుంచి మర్రిగూడ బైపాస్‌కు 5 గంటలకు చేరుకుంటారు. రేవంత్‌తోపాటు ఎంపీలు, ముఖ్యనేతలు, ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చే పార్టీ శ్రేణులతో కలిసి క్లాక్ టవర్‌వరకు పాదయాత్ర నిర్వహిస్తారు. 7 గంటలకు క్లాక్ టవర్ వద్ద జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

రైతులు న్యాయ సలహాలు పొందండి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి నాగరాజు

నార్కట్‌పల్లి: రైతులకు వ్యవసాయ పరంగా ఏవైనా సమస్యలు ఉంటే వ్యవసాయ న్యాయ సలహా కేంద్రం ద్వారా సలహాలు పొందవచ్చని మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. గురువారం నార్కట్‌పల్లిలోని రైతు వేదికలో తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హైదరాబాద్ చైర్మన్ న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు వ్యవసాయ న్యాయ సలహా కేంద్రం(అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్)ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పారా లీగల్ వలంటీర్లు.. రైతులకు అందుబాటులో ఉండి వారికి న్యాయ సలహాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఎ.జయరాజు, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి బి.తిరుపతి, న్యాయ సేవాధికార సంస్థ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బి.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు అదనపు పనులు కల్పించాలి

- అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా

మిర్యాలగూడ: ప్రస్తుత వేసవిలో ఉపాధి హామీ కూలీలకు అధికంగా పనులు కల్పించాలని అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయంలో మిర్యాలగూడ, దామరచర్ల ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే గుర్తించిన పనులను రోజూ ఉదయం 7 గంటల నుంచి 11గంటల వరకు కూలీలతో చేయించాలన్నారు. ఎక్కువ వేతనం వచ్చేలా పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరారెడ్డి, జానయ్య, ఏపీఓలు శశికళ, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మిర్యాలగూడలోని బకల్‌వాడి ఉన్నత పాఠశాలలో ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంఈఓ బాలాజీనాయక్ ఉన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



నార్కట్‌పల్లిలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నార్కట్‌పల్లి: రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నార్కట్‌పల్లిలో జరిగిన డీలర్ల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ డీలర్లు చనిపోతే దాహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలని, గన్నీ బ్యాగులకు రూ.30 చొప్పున చెల్లించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్, హెల్త్ కార్డులను అందించాలన్నారు. ఈ సమావేశంలో రాజయ్య, చక్రహరి నాగరాజు, సూర్యనారాయణ, సత్తిరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వెంకటేశం, మల్లారెడ్డి, ఉపేందర్, భిక్షం, జనార్దన్, యాదయ్య, సత్యం, కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, వెంకట్, శివరావు, పాండయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఇబ్బంది పడకుండా చూడాలి



నార్కట్‌పల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్

- ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టెంట్లు, నీటి వసతి కల్పించాలి
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్

నల్లగొండ రూరల్, నార్కట్‌పల్లి: ఎండ తీవ్రత అధికంగా ఉన్నందును రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టెంట్లు వేయాలని, మంచినీటి వసతి కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్ ఆదేశించారు. గురువారం నల్లగొండ మండలం ఆర్జాలబావి, చందనపల్లితోపాటు నార్కట్‌పల్లిలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షానికి నష్టపోకుండా కొనుగోళ్లలో వేగం పెంచాలని, తాలు పేరిట ఇబ్బందులు కలగకుండా చూడాలని రైతులు కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ధాన్యం డబ్బులు చెల్లింపునకు గాను సరైన వివరాలు సేకరించి ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. లారీల సమస్య రాకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం రామలక్ష్మణ్ రైస్ మిల్లులో అన్‌లోడింగ్‌ను పరిశీలించారు. ఆయన వెంట నల్లగొండ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, అధికారులు నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, అనంతరెడ్డి, సైదులు, తమన్ ఉన్నారు.

డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవు



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

చిట్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద డబ్బులు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు హెచ్చరించారు. గురువారం చిట్యాల మండలం ఉరుమడ్ల, పెద్దకాపర్తి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఎస్‌ఓ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సమయంలో లారీలను ఊడ్చినందుకుగాను రైతుల వద్ద డబ్బులు వసూలు చేయొద్దన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశించారు. అకాల వర్షాలతో ధాన్యం తడకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీసీఓ జి.శ్రీనివాస్, తహసీల్దార్ జక్కర్తి శ్రీనువాసులు, సివిల్ సప్లయ్ ఆర్ఐ డి.లింగస్వామి తదితరులు ఉన్నారు.

ఆకట్టుకుంటున్న కోలాటం పోటీలు



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

మఠంపల్లి: మఠంపల్లిలోని శుభవార్త చర్చి వార్షికోత్సవాల్లో భాగంగా స్థానిక శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళల కోలాటం పోటీలు రెండో రోజు గురువారం ఎస్ఐ ఇరుగు రవి ప్రారంభించారు. ఈ పోటీల్లో కృష్ణా, గుంటూరు, పల్నాడు, సూర్యాపేట, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు చెందిన మహిళా కోలాటం జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో విచారణ గురువులు మార్టిన్, అల్లం బాల, బ్రదర్ వినోద్‌రెడ్డి, సిస్టర్ బాలసుందరి, నాయకులు ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి, టీఆర్ బాలశౌరెడ్డి, గాలిచిన్నపరెడ్డి, ఆంతోనిరెడ్డి, రవీందర్‌రెడ్డి, ధీరజ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, తానం బాల్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, సుజిత్‌రెడ్డి, తరుణ్‌రెడ్డి, న్యాయనిర్ణేతలు ధర్మారి వెంకటేశ్వర్లు, కొమ్ము ఏసుపాదం, తదితరులున్నారు.

లక్ష్యం.. 65.14లక్షల మొక్కలు

- తొమ్మిదో విడత హరితహారానికి సిద్ధమవుతున్న యంత్రాంగం
- ఒక్కో నర్సరీలో 10వేల చొప్పున.. 844 చోట్ల మొక్కల పెంపకం



దేవరకొండ మండలం మర్రిచెట్టుతండా నర్సరీలో పెంచుతున్న మొక్కలు

దేవరకొండ: తొమ్మిదో విడత తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి జిల్లా అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో దాదాపు 65.14 లక్షల మొక్కలు నాటాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. జూన్ మొదటి వారం నుంచి మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న 844 గ్రామపంచాయతీల్లోని నర్సరీల్లో ఒక్కోదాంట్లో దాదాపు 10 వేల చొప్పున అవసరమైన మొక్కలు పెంచుతున్నారు. గత హరితహారం లక్ష్యాలను స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది కూడా విజయవంతం చేయడంతోపాటు నాటిన ప్రతిమొక్కనూ బతికించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

నర్సరీల్లో 15 రకాల మొక్కలు

రాష్ట్ర ప్రభుత్వం గత ఎనిమిదేళ్లుగా తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని హరిత ఉద్యమంలా చేపడుతోంది. రాష్ట్రాన్ని పచ్చనిహారంగా మార్చాలన్న ఉద్దేశంతో వివిధ శాఖల ఆధ్వర్యంలో విరివిగా మొక్కలు నాటుతున్నారు. ఈ ఏడాది కూడా జిల్లాలో ఉత్సవంలా మొక్కల పండుగను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న నర్సరీల్లో వివిధ రకాల పూలు, పండ్లు, నీడ నిచ్చేవి ఇలా 15 రకాల వరకు మొక్కలను పెంచుతున్నారు. వచ్చే నెలలో ఆయా ప్రభుత్వ శాఖల వారీగా ఎన్ని మొక్కలు నాటాలోలక్ష్యాన్ని నిర్దేశించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

వేసవిలో మొక్కల రక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు జిల్లా యంత్రాంగం పక్కాగా ముందుకెళ్తోంది. ప్రస్తుతం వేసవిని దృష్టిలో ఉంచుకొని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నర్సరీల్లో నిరంతరం మొక్కలకు నీరు పెట్టేలా అధికారులు చూస్తున్నారు. ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షిస్తున్నారు.

ప్రణాళికలు రూపొందించాం..



తొమ్మిదో విడత హరితహారంలో మొక్కలు నాటేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించాం. 844 నర్సరీల్లో 65.14 లక్షల మొక్కలు పెంచుతున్నాం. వేసవిని దృష్టిలో ఉంచుకొని నర్సరీలకు గ్రీన్‌షెడ్ నెట్లు ఏర్పాటు చేశాం. వాచర్లను నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో లక్ష్యాన్ని చేరుకుంటాం.

– కాళిందిని, డీఆర్‌డీఓ, నల్లగొండ

ఓపెన్ ఇంటర్ పరీక్షకు 265మంది గైర్హాజరు

రామగిరి(నల్లగొండ): ఓపెన్ ఇంటర్మీడియట్, టెన్త్ పరీక్షలు మూడో రోజుకు చేరాయి. దీంట్లో భాగంగా గురువారం ఇంటర్ పొలిటికల్ సైన్స్ పరీక్షకు 265 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 9 పరీక్ష కేంద్రాల్లో 1,768 మంది విద్యార్థులకు గాను 1,503 మంది హాజరయ్యారు. అలాగే పదో తరగతి ఉర్దూ పరీక్ష 6 కేంద్రాల్లో జరిగింది. దీనికి 95 మంది విద్యార్థులకు 71 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 24 మంది గైర్హాజరయ్యారు. అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా మిర్యాలగూడలో, డీఈఓ భిక్షపతి నల్లగొండలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల సందర్శించి పరిశీలించారు.

పనుల పరిశీలన



పనుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

చందంపేట: మండల పరిధిలో ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను గురువారం అటవీశాఖ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. అనంతరం అటవీ ప్రాంతంలో జరుగుతున్న వివిధ పనులను డీఎఫ్ఓ రాంబాబు పరిశీలించారు. వేసవి దృష్ట్యా అటవీ జంతువుల దాహార్తిని తీర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎఫ్‌డీఓ సర్వేశ్వర్‌రావు, ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీధర్‌రావు, ఏఈఈ శివరాజ్, అటవీ శాఖ అధికారులు తదితరులున్నారు.

నేటి నుంచి జేపీఎస్‌ల సమ్మె



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

నల్లగొండ: తమను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శు(జేపీఎస్)లు శుక్రవారం నుంచి సమ్మెబాట పట్టనున్నారు. ఇందులో భాగంగా గురువారం నల్లగొండలోని ఎన్జీ కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి ఏఓ మోతీలాల్, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డిలకు వినతిపత్రాలు సమర్పించారు. నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం పూర్తయిన జేపీఎస్‌లను రెగ్యులర్ చేసే విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఈనెల 13న పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌కు, 15న కలెక్టర్‌కు సైతం సమ్మె నోటీసులు ఇచ్చారు.

734 మంది సమ్మెలోకి..

జిల్లాలో 844 గ్రామపంచాయతీలు ఉండగా 648 పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న జేపీఎస్‌లు ప్రొబేషనరీ కాలం పూర్తిచేసుకొని రెగ్యులరైజ్ కోసం ఎదురుచూస్తున్నారు. మరో 86మంది అవుట్ సోర్సింగ్ కార్యదర్శులుఉన్నారు. వీరంతా సమ్మెలోకి వెళ్తున్నారు. కేవలం 110 మంది రెగ్యులర్ కార్యదర్శులు మాత్రమే విధులు నిర్వహించనున్నారు.

ఇబ్బందులు ఏర్పడే అవకాశం

గ్రామాల్లో ప్రస్తుతం అన్ని ప్రభుత్వ, ప్రజా అవసరాలకు సంబంధించిన దాదాపు 43 రకాల పనులు పంచాయతీ కార్యదర్శుల ద్వారానే చేయిస్తున్నారు. ఆన్‌లైన్ విధానాలతోనే పనిఒత్తిడి పెరిగినా కొత్త జేపీఎస్‌లు అంతా విద్యావంతులు కావడంతో శిక్షణ లేకున్నా విధుల్లో ముందుకు పోగలుగుతున్నారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి, ఇతర పనుల వివరాలను ఆన్‌లైన్‌లో పంపించడం వల్ల గ్రామాలు జాతీయ, రాష్ట్ర స్థాయిలో అవార్డులు దక్కించుకుంటున్నాయి. అయితే ప్రస్తుతం వారు సమ్మెలోకి వెళితే గ్రామాల్లో ఇబ్బందులు ఏర్పడనున్నాయి. ప్రధానంగా జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాల జారీతోపాటు అసెస్మెంట్లు, ఉపాధి హామీ, ఇతర అభివృద్ధి పనుల విషయంలో కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండనుంది.

క్లుప్తంగా

ఎయిమ్స్‌లో కోవిడ్ ప్రికాషనరీ డోస్



వ్యాక్సినేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో కోవిడ్ ప్రికాషనరీ డోస్ వ్యాక్సినేషన్‌ను గురువారం ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా ప్రారంభించి మాట్లాడారు. ఎయిమ్స్‌లో 25వేల కోవిడ్ వ్యాక్సిన్లు పూర్తి చేసి రికార్డు సృష్టించినట్లు పేర్కొన్నారు. కోవిడ్ కేసులు పెరుగుతున్నందున ముందు జాగ్రత్తగా రెండవ డోస్ తీసుకున్న వారందరికీ ప్రికాషన్ డోస్ అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. కోవ్యాక్సిన్, కోవిషీల్డ్ రెండు వ్యాక్సిన్లు మొదటి, రెండవ సారి తీసుకున్నవారు కార్బీ వ్యాక్స్ ప్రికాషనరీ డోస్‌కు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో కోవిడ్ వ్యాక్సినేషన్ అసోసియేట్ వైద్యులు గోవిందు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్‌ను కలిసిన మంత్రి, ఎమ్మెల్యేలు



సీఎం కేసీఆర్‌కు ఫొటో బహూకరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు

నల్లగొండ టూటౌన్: భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన పార్టీ ప్రతినిధుల సభకు ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం సీఎం కేసీఆర్‌ను కలిసి ఆయన ఫొటోను బహూకరించారు. సీఎం కేసీఆర్‌ను కలిసిన వారిలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదయ్య, జెడ్పీ చైర్మన్లు బండా నరేందర్‌రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, గుజ్జ దీపిక, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, ఎన్.భాస్కర్ రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గాదరి కిశోర్‌కుమార్, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, శానంపూడి సైదిరెడ్డి, నోముల భగత్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి



ప్రచార జాతాను ప్రారంభిస్తున్న రత్నాకర్‌రావు

నార్కట్‌పల్లి : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టు పనులను తక్షణమే పూర్తి చేయాలని సీపీఐ సీనియర్ నేత ఉజ్జిని రత్నాకర్‌రావు, జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం నార్కట్‌పల్లి మండలం బి.వెల్లెంల ప్రాజెక్టు వద్ద సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతాను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం, బి. వెల్లెంల ప్రాజెక్టులకు సరిపడా నిధులను కేటాయించకపోవడంతో నేటి వరకు కూడా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు మతోన్మాద విధానాల కారణంగా దేశ లౌకిక వ్యవస్థకు పెను ప్రమాదం పొంచి ఉందని ఆందోళనవ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. రైతులకు రుణ మాఫీ అని చెప్పి మాయమాటలతో మోసం చేస్తున్నారన్నారు. రైతుల ఆత్మహత్యలు కూడా మరింత పెరిగిపోయాయన్నారు. దళిత బంధు పథకం కూడా అందరికీ వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పబ్బు వీరస్వామి, పెండ్యాల శంకర్, ఎండి అక్బర్, ఎండి జాహింగీర్, షరీఫ్, భిక్షం, లక్ష్మయ్య, చిన వెంకన్న, బాలరాజు, శేఖర్‌రెడ్డి, రమేష్, లెనిన్, వీరయ్య తదితరులున్నారు.

వ్యభిచార ముఠా గుట్టు రట్టు

కోదాడ రూరల్ : కోదాడ పట్టణంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార ముఠా గుట్టును కోదాడ పోలీసులు రట్టు చేశారు. సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అనంతగిరి రోడ్డులో నివాసం ఉంటున్న ఓ వివాహిత ఖమ్మం జిల్లాకు చెందిన మరో మహిళతో కలిసి అమాయక మహిళలను రొంపిలోకి దింపి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు అనంతగిరి రోడ్డులో ఉంటున్న మహిళ నివాసంపై దాడి చేయగా బాధిత మహిళతో పాటు ఓ విటుడు పట్టుబడ్డారు. అదే విధంగా పట్టణంలోని కట్టకొమ్ము గూడెం రోడ్డులో ఉంటున్న ఓ వివాహిత మరో మహిళతో కలిసి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు అందుకున్న సమాచారం మేరకు దాడి చేసి ఓ విటుడు, ఇద్దరు బాధిత మహిళను అదుపులోకి తీసుకున్నారు. కాగా, వారి వద్ద నుంచి కొంత నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విటులను కోర్టులో హాజరుపరిచి బాధిత మహిళలను మహిళా సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు రామాంజనేయులు, ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాలో నటించేందుకు అవకాశం

నల్లగొండ టూటౌన్: అవంతి క్రియేషన్స్ బ్యానర్‌లో లిటిల్ సోల్జర్ పేరిట నిర్మించనున్న బాలల చిత్రంలో నటించాలనే ఔత్సాహికులకు అవకాశం కల్పించనున్నట్లు దర్శకుడు, నిర్మాత బి.కిషోర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం కుటుంబ నేపథ్యంలో సాగే దేశ భక్తి చిత్రంలో స్థానిక నటీ నటులకు, 7నుంచి 10 ఏళ్లలోపు బాలలకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈనెల 29న నల్లగొండలోని బస్టాండ్ సమీపంలో గల రెడ్ క్రాస్ భవన్‌లో ఉదయం 9గంటల నుంచి ఆడిషన్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9908231369 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

నిరసన ర్యాలీని విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్



గ్రంథాలయంలో నిరుద్యోగ యువతతో మాట్లాడుతున్న నాయకులు

నల్లగొండ : జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నందున యువత పాల్గొని విజయవంతం చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా గ్రంథాలయంలో ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతను కలిశారు. పేపర్ లీకేజీ ప్రభుత్వ నిర్లక్ష్యం నిరుద్యోగ యువతకు శాపంగా మారిందని పేర్కొన్నారు. నోటిఫికేషన్లు లేవు, వచ్చిన వాటికి అక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ధైర్యం కల్పించే విధంగా చేపట్టే నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తండు సైదులు గౌడ్, ఎస్సెసెల్ చైర్మన్ ఆదిమల్ల శంకర్, నాయకులు జిల్లాపల్లి పరమేష్, శివ శంకర్, నిరుద్యోగ జేఏసీ పాల్వాయి రవి పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెంలో బుధవారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో దొంగతనం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సుర్కంటి పద్మ తన ఇంటికి తాళం వేసి పక్కింటికి వెళ్లి పడుకుంది. అర్ధరాత్రి సమయంలో దుండగులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి వెళ్లారు. అరతులం బంగారు రింగు, 25తులాల వెండి ఆభరణాలు చోరీ చేశారు. అదే విధంగా సమీపంలోనే ఉన్న ఎస్‌కె.నాగుల్‌మీర కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. అతని ఇంటి తాళం పగులగొట్టి లోనికి వెళ్లిన దొంగలు అరతులం గోల్డ్ రింగు, 10వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అనిల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో అధికారులు

చండూరు : అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయీస్, పోలీస్ అధికారులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. చండూరు మండలం గుండ్రపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కార్డుదారుల నుంచి పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ ఉంచాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్ విజయ పోలీసులతో కలసి గురువారం దాడి చేసి ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై 6(ఏ) చట్టం కింద కేసు నమోదు చేసి, బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌లో భద్రపరిచినట్లు డీటీ తెలిపారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించాలి



ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ అనిల్ కుమార్


కనగల్: నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించాలని దేవదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ కోరారు. ఆలయ అవసరాల నిమిత్తం ప్రైవేట్ వ్యక్తుల నుంచి కొనుగోలు చేస్తున్న భూములను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం దుకాణాదారులతో ఆయన మాట్లాడారు. వేసవి కాలం కావడంతో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఆలయ సిబ్బంది సమయపాలన పాటించి భక్తులకు అందుబాటులో ఉండాలన్నారు. అంతకుముందు ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ మహేంద్ర కుమార్, హైదరాబాద్ జోన్ తహసీల్దార్ సునిత, ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆలయ మాజీ చైర్మన్ నల్లబోతు యాదగిరి, జూనియర్(ఏసీ కార్యాలయం) అసిస్టెంట్ అఖిల్, ఆలయ సిబ్బంది లింగయ్య, లింగస్వామి, అర్చకులు మల్లాచారి, శ్రవణ్‌చారి, ఉమామహేష్, దామెదర్, నాగరాజు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 14 గొర్రెలు మృతి

భూదాన్‌పోచంపల్లి : కుక్కల దాడిలో 14గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకొంది. బాధితులు బందెల వెంకటేశం, పిట్టమోని రాములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామశివారులో గల రంగనాయకగుడి వెనుకాల గ్రామానికి చెందిన కాపరులు గొర్రెల మందను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి రోజు రాత్రి వారు మందవద్ద కాపలాగా పడుకొంటారు. కాగా, గురువారం తెల్లవారుజామున గొర్రెలు అరుస్తున్న శబ్దానికి లేచి చూడగా కుక్కల గుంపు వెంకటేశానికి చెందిన మందపై దాడిచేసి 10 గొర్రెలను చంపేశాయి. అప్రమత్తమైన గొర్రెలకాపరులు వాటిని వెళ్లగొట్టే ప్రయత్నం చేయగా సమీపంలో ఉన్న రాములుకు చెందిన మందపై పడి నాలుగు గొర్రెలను చంపేశాయి. అందరూ కలిసి కర్రలతో వెంటపడగా కుక్కలు అక్కడి నుంచి పారిపోయాయి. ఈ దాడిలో సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు. కాగా, ఘటనా స్థలాన్ని ఉపసర్పంచ్ పడాల సతీష్‌చారి, కాంగ్రెస్‌పార్టీ మండల ప్రధానకార్యదర్శి తోట శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు బీరెడి సందీప్‌రెడ్డి, గణేశ్ సందర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

'కేఆర్ఆర్' చరిత్రను క్రమబద్ధంగా నిర్మించాలి

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న సాహిత్య అకాడమీ చైర్మన్ గౌరీశంకర్

కోదాడఅర్బన్ : ఆరు దశాబ్దాలుగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన కోదాడలోని కేఆర్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల చరిత్రను క్రమబద్ధంగా నిర్మించాలని ఆ కళాశాల పూర్వ విద్యార్థి, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ సూచించారు. గురువారం కళాశాలలో మన ఊరు-మన చరిత్ర ప్రాజెక్టుపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కళాశాలకు ఎంతో మంది మహనీయులు ప్రిన్సిపాల్స్‌గా, అధ్యాపకులుగా పనిచేశారని పేర్కొన్నారు. ఇక్కడ చదివిన ఎంతో మంది ఉద్యమకారులు, రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, పరిపాలనాదక్షులు, ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎదిగారని గుర్తుచేశారు. చరిత్రను రాయడమే కాకుండా దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మనపైనే ఉందన్నారు. ఆ కళాశాలలో చదివి సామాజిక, సాంస్కృతిక, వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ అధ్యాపక, విద్యార్థి, రాజకీయ నాయకుల అంశాలను చరిత్రలో నమోదు చేయాలని ఆయన సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగు మాట్లాడుతూ మన ఊరు-మనచరిత్ర ప్రాజెక్ట్ త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. మన ఊరు-మన చరిత్ర సూర్యాపేట జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ నందిగామ నిర్మల కుమారి మాట్లాడుతూ మన ఊరు-మనచరిత్ర అంటే మన మూలాలను మనం వెతుక్కోవడమేనన్నారు. చరిత్రను నమోదు చేయడం భావితరాలకు ఎంతో అవసరమన్నారు. సదస్సులో కళాశాల ఐక్యూ కోఆర్డినేటర్ డాక్టర్ నోముల వెంకటేశ్వర్లు, జర్నలిస్ట్ హరికృష్ణ, అధ్యాపకులు వేముల వెంకటేశ్వర్లు, సత్యవాణి, శ్రీదేవి, సైదులు, జీఎల్ ఎన్‌రెడ్డి, నర్సింహారాజు, సుమలత, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు జూలూరి గౌరీ శంకర్‌ను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

ఉన్నత విద్యకు శాస్త్రీయ వ్యాసాలు అవసరం

రామగిరి(నల్లగొండ): ఉన్నత విద్యలో శాస్త్రీయ వ్యాసాలు రాయడం అవసరమని బలానీ ఇన్ఫోటెక్ రిసెర్చ్ మేనేజర్ డాక్టర్ నిఖిత వంజరి అన్నారు. గురువారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల నందు గ్రంథాలయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్ ద్వారా ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ రిసోర్సెస్, పరిశోధన నైపుణ్యాలపై నేషనల్ వెబినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. కంప్యూటర్ ద్వారా అధికారిక పరిశోధన సమాచారాన్ని వెతికే విధానం, రీసెర్చ్ రైటింగ్, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 తదితర అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. వెబినార్ కన్వీనర్ డాక్టర్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ దేశంలోని వివిధ యూనివర్సిటీల నుంచి 600 పైగా పరిశోధకులు, లైబ్రేరియన్లు, అధ్యాపకులు, విద్యార్థులు వెబినార్‌లో పాల్గొన్నారన్నారు. ప్రిన్సిపాల్ ఘనశ్యామ్ అధ్యక్షతన జరిగిన ఈ వెబినార్‌లో కో కన్వీనర్ మణెమ్మ, వైస్ ప్రిన్సిపాల్ సయ్యద్ మునీర్, అంతటి శ్రీనివాసులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసన్నకుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ వెంపటి శ్రీనివాసులు, సీఓఈ బి.నాగరాజు, అధ్యాపకులు యాదగిరి, దీపిక, యాదగిరిరెడ్డి, నాగేల వేణు, భాగ్యలక్ష్మి, కృష్ణకొండిన్య, లవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుబ్బారావు, శ్రీనివాస్, చంద్రశేఖర్, మల్లేష్, శివరాణి, విష్ణువర్ధన్, స్రవంతి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆల్ ఇండియా రేడియో కేంద్రాలు ప్రారంభం

- డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మి



దేవరకొండలో మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

నల్లగొండ/దేవరకొండ : దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్‌గా 91 ఎఫ్ఎం రేడియో కేంద్రాలను ప్రారంభించనున్నారు. అందులో భాగంగా దేవరకొండ, నల్లగొండలో కూడా ఆల్ ఇండియా రేడియో కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ప్రసార భారతి డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మి తెలిపారు. శుక్రవారం దేవరకొండలో విలేకరులతో ఆమె మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం నాలుగు ఆల్ ఇండియా రేడియో కేంద్రాలు ప్రారంభిస్తుండగా అందులో భాగంగా రామగుండం, సిర్పూర్, నల్లగొండ, దేవరకొండలో రేడియో కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. 100.1ఎంహెచ్‌జెడ్ ఫ్రీక్వెన్సీలో ఈ రేడియో కేంద్రం పని చేస్తుందని, దీనిద్వారా దేవరకొండ పరి ధిలోని 20 కి.మీ. మేర ప్రజలకు వార్తా, విజ్ఞాన, వినోద సేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏడీఈ నర్సింహానాయక్, శ్రీనివాసచారి, హేమచందర్, ఆరోగ్యరెడ్డి ఉన్నారు.

కుటుంబ సంక్షేమ నిధిలో చేరాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్.రాములు

సూర్యాపేటటౌన్ : టీఎస్ యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధిలో(ఎఫ్‌డబ్ల్యుఫ్) సంఘం సభ్యులు తప్పకుండా చేరాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో కుటుంబ సంక్షేమ నిధి విధి విధానాలను వివరించేందుకు నిర్వహించిన డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కేంద్ర ప్రభుత్వం తొలగించిన పాఠ్యాంశాలను చేర్చాలని కోరారు. డీఏ, పీఆర్‌సీ బకాయిలు, పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. సమావేశంలో సంఘం కోశాధికారి జి.వెంకటయ్య, ఎస్‌కె.సయ్యద్, ఆడం, వెలుగు రమేష్, లాలు, శ్రీనివాసాచారి, ఆనంద్, ఎన్.సైదా, రమేష్, సీనయ్య, బాలాజీ, ఉదయభాస్కర్, జమాలుద్దీన్, ఆంజనేయులు, నర్సయ్య, అంజయ్య పాల్గొన్నారు.

మునీర్‌కు వందేభారత్ భీష్మ అవార్డు



అవార్డు అందుకుంటున్న మునీర్

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణానికి చెందిన జనమైత్రి ఫౌండేషన్ చైర్మన్ ఎండి. మునీర్‌కు వందేభారత్ భీష్మ అవార్డు దక్కింది. జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సామాజిక సేవలను గుర్తించిన తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మునీర్‌కు బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, ఎమ్మెల్యే శ్రీరాములు చేతుల మీదుగా వందే భారత్ భీష్మ అవార్డును అందచేశారు. ఈ సందర్భంగా మునీర్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి : రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం రాత్రి భువనగిరి రైల్వే స్టేషన్‌కు సమీపంలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి రాత్రి భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి వెళ్లే మార్గంలో రైల్వే లేవల్ క్రాసింగ్ వద్దకు రాత్రి 8 గంటల సమయానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్తున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు తగిలి అందులో ఇరుక్కుపోయాడు. డ్రైవర్ గమనించి ముత్తిరెడ్డి గూడెం వెళ్లే రైల్వే గేటు వద్ద రైలును నిలిపివేశాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని రైలులో ఇరుక్కున్న మృతదేహాన్ని తొలగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ భువనగిరి ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ కేంద్రాల్లో నత్తనడకన కొనుగోళ్లు నడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోడంలేదన్నారు. అకాల వర్షాలకు రైతుల వడ్లు తడిసిపోతున్నా ప్రభుత్వానికి పట్టింపులేదన్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.25 వేల పరిహారం ఇవ్వాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఓ మోతిలాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, చలమల్ల సీతారాంరెడ్డి, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, దాసోజు యాదగిరాచారి, భువనం మధుసూదన్‌రెడ్డి, పాలకూరి రవిగౌడ్ పాల్గొన్నారు.

